సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం అమ్మకాలు సాగాయి.



వృత్తి నైపుణ్యతతోనే రాణింపు

వృత్తి నైపుణ్యతతో జీవనోపాధి మెరుగుపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి దీన అన్నారు. మంగళవారం రెడ్డిపల్లి జిల్లా జైలును ఆమె సందర్శించారు. 8లో

గరిష్టం/కనిష్టం
31.2°/16.9°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు కర్ణాటక హైకోర్టు జడ్జి రాక

పుట్టపర్తి అర్బన్: కర్ణాటక హైకోర్టు జడ్జి ఎంఐ అరుణ్ బుధవారం జిల్లాకు విచ్చేస్తున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఆయన పెనుకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారన్నారు. అనంతరం సమీపంలోని 'పచ్చ పార్శ్వనాథ్' ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని వెల్లడించారు. దర్శనం అనంతరం చిక్‌బళ్లాపూర్ బయలుదేరి వెళ్తారన్నారు.

చిన్నారిని మింగిన నీటిగుంత

- సంపులో పడి రెండేళ్ల బాలుడి మృతి



మృతి చెందిన చిన్నారి మేఘశ్యామ్

ధర్మవరం అర్బన్: నిండా రెండేళ్లు లేని ఓ చిన్నారిని ఇంటిముందున్న నీటిగుంత మింగేసింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన ముత్యాలు, భాగ్యమ్మ దంపతులకు రెండేళ్ల కుమారుడు మేఘశ్యామ్ సంతానం. స్థానికంగా ఉన్న బేకిరీలో ముత్యాలు మాస్టర్‌గా పనిచేస్తుండగా, భాగ్యమ్మ ఇంటి వద్దే ఉంటూ కుమారుడి ఆలనాపాలనా చూసుకుంటోంది. మంగళవారం ముత్యాలు బేకరీకి వెళ్లగా సాయంత్రం వేళ భాగ్యమ్మ ఇంటి పనుల్లో నిమగ్నమైపోయింది. ఈ సమయంలో ఆడుకుంటూ ఇంటి బయటకు వెళ్లిన మేఘశ్యామ్ సమీపంలో ఉన్న నీటి సంపులో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన భాగ్యమ్మ వెంటనే కుమారుడిని సంపులోంచి బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మేఘశ్యామ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ముత్యాలు, భాగ్యమ్మ దంపతులు బోరున విలపించారు.

5 బస్సులపై కేసులు



బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ వరప్రసాద్

కదిరి అర్బన్: నిబంధనలు పాటించని 5 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ తెలిపారు. వివరాలు.. కదిరి–బెంగళూరు రహదారిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పలు బస్సులు తనిఖీ చేశారు. సమయపాలన పాటించకపోవడం, సరైన రికార్డులు లేకపోవడం, తదితర నిబంధనలు పాటించకపోవడంతో 5 బస్సులపై మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

రెవెన్యూలో లంచావతారం!



- కలెకరేట్‌లో అవినీతి అధికారి దందా
- పెద్దసారు పేరుతో భారీ దోపిడీ
- ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్న వైనం
- ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే వసూళ్ల పర్వం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న సామాన్యులు

సాక్షి, పుట్టపర్తి

కలెక్టరేట్‌లోని కొందరు అధికారుల నిర్వాకంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి అడ్డంగా దోచేస్తున్నారు. తమ వ్యవహారం బయటకు రాకుండా మధ్యలో దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇదే అదునుగా దళారీలు విచ్చలవిడిగా వసూళ్లు చేయడం మొదలుపెట్టారు. 'పెద్ద సారు' చెప్పారంటూ భారీగా వసూళ్లు చేస్తున్నారు. ఈ బృందానికి గతంలో బత్తలపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై కలెక్టరేట్‌కు చేరుకున్న ఓ ఉద్యోగి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీ హయాంలో చేసిన తరహాలోనే రెవెన్యూ అంశాల్లో దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏకంగా ముఖ్య అధికారి పేరుతో భారీ దందా చేస్తుండటం గమనార్హం.

నిబంధనలకు విరుద్ధంగా 51 బుక్‌లు..

సదరు అధికారి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బత్తలపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. ఆ సమయంలో టీడీపీ నేతల కనుసన్నల్లో అక్రమాలకు తెరదీశాడు. ప్రభుత్వం మారగానే నేరుగా కలెక్టరేట్‌లో వచ్చి కూర్చున్న అతను పాత పద్ధతినే అవలంబిస్తున్నాడు. కొందరు టీడీపీ నేతలు అండదండలతో చెలరేగిపోతున్నాడు. నకిలీ పాసు పుస్తకాలతో పాటు తనకు నగదు ముట్టజెప్పిన వారికి రెవెన్యూ పనులు చేయిస్తున్నాడు. ఇందులో భాగంగా పోరంబోకు భూములకు కూడా పట్టాలు ఇచ్చేస్తున్నాడు. ఒక్క బత్తలపల్లి మండలంలోనే తనకు ముడుపులు ముట్టజెప్పిన 51 మందికి నిబంధనలకు విరుద్ధంగా పాసు పుస్తకాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

ఓ వైపు వసూళ్లు.. మరో వైపు వేధింపులు..

కింది స్థాయి సిబ్బందికి టార్గెట్‌లు విధిస్తున్న సదరు అధికారి... ఇవ్వని వారిని వేధిస్తున్నట్లు రెవెన్యూ అధికారులే వాపోతున్నారు. ఈ అవినీతి అధికారి చెప్పినంత ఇచ్చుకోలేక...ప్రజలతో వసూళ్లు చేయలేక కొందరు తహసీల్దార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లంచాలు ఇవ్వలేకుంటే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాలని, అప్పుడు మరొకరిని ఆ స్థానంలో తెచ్చుకుని తమ దందా సాగిస్తామని బహిరంగంగానే సదరు అధికారి చెబుతుండటం గమనార్హం.

పెద్దసారు పేరుతోనే..

కలెక్టరేట్‌లో పనిచేసే సదరు అధికారి అన్ని మండలాల తహసీల్దార్లపై పెత్తనం చేస్తూ భారీగానే రాబడుతున్నాడు. వసూళ్లలో తలో వాటా పంచుతున్నాడు. అయితే ఇందులో 'పెద్ద సారు' పేరిట అదనంగా మరో భాగం పంచుతున్నాడట. ఆయన ఎవరని అవతలి వ్యక్తి ప్రశ్నిస్తే.. పేరు చెప్పకుండా మాట దాట వేస్తున్నాడని తెలిసింది. ఈక్రమంలో పెద్ద సారు ఎవరనేది రెవెన్యూ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది.

- చుక్కల భూములు, 22ఏ జాబితాలో చేరిన భూములు రిజిస్ట్రేషన్ కాకుండా గత టీడీపీ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెట్టింది. దీంతో సీఎం వైఎస్ జగన్ రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. అసైన్ చేసి 20 ఏళ్లయిన భూములపై యాజమాన్య హక్కులు కల్పించారు. అలాగే 1954 ముందు అసైన్డ్ అయిన భూములు, స్వాతంత్య్ర సమరయోధులు, విశ్రాంత సైనికులకు పట్టాలిచ్చి పదేళ్లు దాటి ఉంటే విచారించి ఎన్‌ఓసీ ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. కానీ కలెక్టరేట్‌లోని ఓ అధికారి తన చేతులు తడిపిన వారికే ఎన్‌ఓసీలు ఇచ్చి మిగతా ఫైళ్లను పెండింగ్‌లో పెట్టారని బాధితులు చెబుతున్నారు.
- బత్తలపల్లి మండలం సంగాల సర్వే నంబర్ 268–2 నంబర్‌లో వంకపోరంబోకు ఉంది. వాస్తవానికి దీనికి పట్టాలియ్యకూడదు. కానీ సదరు అధికారి డబ్బులు తీసుకుని ఓ టీడీపీ నేతకు పట్టాలిచ్చినట్లు తెలుస్తోంది. ఇక బత్తలపల్లి మండలంలో భూపంపిణీతో సంబంధం లేకుండానే 51 మంది టీడీపీ సానుభూతి పరులకు పాసుపుస్తకాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

...ఇలా ఒకటేమిటి సదరు అధికారి రెవెన్యూలో అంది వచ్చిన ప్రతి అంశాన్ని ఆదాయ వనరుగా మార్చుకుంటూ జనాన్ని భారీగా దోచేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పెద్దసారు పేరు చెప్పి వారు నోళ్లు మూయిస్తున్నారు.

నూతన జేసీగా అభిషేక్ కుమార్

- పెనుకొండ సబ్ కలెక్టర్‌గా అపూర్వ భరత్
- జేసీ చేతన్ గ్రామ/వార్డు సచివాలయాల డైరెక్టర్‌గా బదిలీ
- సబ్‌కలెక్టర్ కార్తీక్ అల్లూరి సీతారామరాజు జిల్లా జేసీగా నియామకం



అభిషేక్‌కుమార్, జాయింట్ కలెక్టర్



అపూర్వ భరత్, పెనుకొండ సబ్‌కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అభిషేక్ కుమార్ ప్రస్తుతం కర్నూలు జిల్లా ఆదోని సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ జేసీగా పనిచేస్తున్న టీఎస్ చేతన్‌ను గ్రామ/వార్డు సచివాలయ డైరెక్టర్‌గా నియమించారు. అలాగే పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న కొల్లాబత్తుల కార్తీక్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ఇటీవలే ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న అపూర్వ భరత్‌ను పెనుకొండ సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా ఏర్పాటైన శ్రీసత్యసాయి జిల్లాకు రెండవ జేసీగా బాధ్యతలు చేపట్టిన జేసీ చేతన్ విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరించి ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. తన దగ్గరకు వచ్చే ప్రజల సమస్యలు సావధానంగా విని పరిష్కరిస్తూ మంచి గుర్తింపు పొందారు.

ధర్మవరంలో బాలరాముడి రథయాత్ర





9.9 అడుగుల ఎత్తు ఉన్న బాలరాముడి విగ్రహం, బాలరాముడి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: అయోధ్యలో కొలువుదీర్చేందుకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ శిల్పులు తయారు చేసిన 9.9 అడుగుల ఎత్తయిన బాలరాముడి రాతి విగ్రహం మంగళవారం ప్రత్యేక వాహనంలో ధర్మవరం చేరుకుంది. దీంతో స్థానికులు బాలరాముడి విగ్రహంతో ఎరగుంట సర్కిల్ నుంచి ఆర్టీసీబస్టాండ్, కళాజ్యోతి సర్కిల్ మీదుగా శివానగర్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు రథయాత్ర నిర్వహించారు. జనవరి 20వ తేదీలోపు అయోధ్యకు చేరుస్తామని తిరుపతికి చెందిన దానధర్మ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డిజైనర్ జుజారు నాగరాజు, శంకర్ చంద్రశేఖర్, శ్రీరాములు, సనత్, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, గట్టు నాగరాజు, విశ్వహిందూ పరిషత్ పులిచెర్ల వేణుగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్‌గా మంజుల కొనసాగింపు



మాల్యవంతం మంజుల

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్‌గా మాల్యవంతం మంజులను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ చైర్మన్‌తో పాటు జోనల్ చైర్‌పర్సన్ల పదవీ కాలం ఇటీవల ముగిసింది. 2021 సెప్టెంబర్‌లో వీరి నియామకం జరిగింది. రెండేళ్ల పాటు ఆర్టీసీ అభివృద్ధికి వీరు కృషి చేశారు. అయితే ఆర్టీసీ చైర్మన్‌గా మల్లికార్జునరెడ్డితో పాటు జోనల్ చైర్‌పర్సన్‌లను కొనసాగించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. దీంతో వైఎస్సార్‌కడప, అనంతపురం జోనల్ చైర్ పర్సన్‌గా మంజుల కొనసాగనున్నారు. ముఖ్యమంత్రి నిర్ణయంపై జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెన్నోబిలేసు హర్షం వ్యక్తం చేశారు. మరోసారి అవకాశం కల్పించడంతో కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ అభివృద్ధికి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంజుల ఈ సందర్భంగా తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో క్రిస్మస్ వేడుకలు

పుట్టపర్తి అర్బన్: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు క్రిస్మస్ వేడుకలు, తేనేటి విందు ఉంటాయని కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రైస్తవులు భారీగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

విద్యుత్ పొదుపు ఉద్యమంలా సాగాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఈఈ మోజెస్ తదితరులు

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: విద్యుత్ పొదుపు ఉద్యమంలా సాగాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు కోరారు. మంగళవారం దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీకి కలెక్టర్, విద్యుత్ శాఖ ఈఈ మోజెస్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ విద్యుత్ ఆదా చేసి భావితరాలకు భరోసా ఇవ్వాలన్నారు. ఇళ్లలో ఎల్‌ఈడీ బల్బులు వాడి విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. వీలైనంత వరకూ పగటి పూట లైట్లు వేసుకోవద్దన్నారు. ఇళ్లలో సోలార్ మీటర్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఖర్చు తగ్గుతుందన్నారు. ఎక్కువ వేడి నీటితో కాకుండా గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే ఆరోగ్యంగా ఉండడమే గాక విద్యుత్ ఆదా అవుతుందన్నారు. విద్యుత్ శాఖ ఈఈ మోజెస్ మాట్లాడుతూ... ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ దేశ వ్యాప్తంగా ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా రైతులు, ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. అనంతరం ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఈ శరవణన్, ఏఈలు నారాయణమ్మ, శ్రీనివాస్ నాయక్, నారాయణ స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి

పుట్టపర్తి అర్బన్: కుష్టు వ్యాధిని జిల్లాలో సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కుష్టు వ్యాధి నిర్మూలనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..కుష్టు వ్యాధి బారిన పడిన వారి గుర్తింపు కోసం ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకూ ఇంటింటి సర్వే పక్కాగా చేయాలన్నారు. ఇంటింటి సర్వే కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రతి బృందంలోనూ ఆశా కార్యకర్త, వలంటీర్ ఉండేలా చూడాలన్నారు. జనవరి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడత నిర్వహిస్తున్న నేపథ్యంలో కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కుష్టు వ్యాధిగ్రస్తుల పునరావాస కేంద్రాలపై కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ... జిల్లాలోని దర్శనమల, తాడిమర్రి, ఎన్‌పీకుంట, రెడ్డిపల్లి, కదిరి అర్బన్, ధర్మవరం అర్బన్, మత్తలపల్లి, పరిగి, గుడిబండ, కల్లుమర్రి, చౌలూరు, చిలమత్తూరు ప్రాంతాల్లో కేసులు నమోదైనట్లు కలెక్టర్‌కు వివరించారు. 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ 100 కొత్త కేసులు నమోదయ్యాయని, వారికి క్రమం తప్పకుండా వైద్యం అందిస్తున్నామన్నారు. సమావేశంలో డీపీఎంఓ కుళ్లాయప్ప నాయక్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, బత్తలపల్లి ఆర్డీటీ వైద్యులు రఘురాంరెడ్డి, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు వెంకటరమణ, రెడ్డి కుమార్‌రెడ్డి, జిల్లా ప్రజారోగ్య అధికారిణి వీరమ్మ, డెమో బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

పెనుకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ విజయప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల ప్రజావేదిక నిర్వహించారు. పంచాయతీల వారీగా జరిగిన పలు పనుల వివరాలను సమావేశంలో చదివి వినిపించారు. 2022 నుంచి 2023 వరకూ జరిగిన 727 పనుల్లో రూ. 17 వేలు దారి మళ్లినట్లు గుర్తించారు. ఆ మొత్తాన్ని సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేశారు. డీవీఓ రమణారెడ్డి, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ శివశంకరప్ప, ఏపీఓ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల సర్వే పరిశీలన



బత్తలపల్లి చెరువులో సర్వేను పరిశీలిస్తున్న పాండురంగ

బత్తలపల్లి: మండలంలో నిర్వహిస్తున్న జలవనరుల సర్వేను రాష్ట్ర స్టాటిస్టికల్ అసిస్టెంట్ డైరెక్టర్ పాండురంగ పరిశీలించారు. మంగళవారం బత్తలపల్లి చెరువులో ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తదితరులు చేపట్టిన సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెరువు విస్తీర్ణం, ప్రభుత్వ రికార్డుల ప్రకారం సర్వే చేశారా? లేదా? అంటూ ఏఎస్‌ఓ, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని చెక్‌డ్యాంలు, చెరువులను రికార్డుల ప్రకారం సర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాసనాయక్, ధర్మవరం డివైఎస్‌ఓ గోపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కారణం లేకుండా ఒక్క ఓటూ తొలగించొద్దు



ప్రశాంతిగ్రామం 107 పోలింగ్ కేంద్రంలోని ఓటరు వివరాలు పరిశీలిస్తున్న మురళీధర్‌రెడ్డి



ధర్మవరంలో బీఎల్‌ఓతో వివరాలు సేకరిస్తున్న జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

- అధికారులకు జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి ఆదేశం

పుట్టపర్తి అర్బన్/ధర్మవరం అర్బన్: సరైన కారణం లేకుండా ఒక్క ఓటు కూడా తొలగించకూడదని జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు సవరణ జాబితా ప్రక్రియలో భాగంగా మంగళవారం ఆయన పుట్టపర్తి పరిధిలోని ప్రశాంతిగ్రామం, కొత్త చెరువు, ధర్మవరంలలో పర్యటించారు. తొలుత ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ నవీన్‌కుమార్‌తో కలిసి ప్రశాంతిగ్రామం ప్రాథమిక పాఠశాలలోని 107 పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పరిధిలో 18 ఏళ్లు నిండిన రాహుల్, కుళ్లాయప్ప, యోగేశ్వరను ఓటు నమోదు, ఫారం–6 ఎలా భర్తీ చేశారని ఆరా తీశారు. ఇటీవల మరణించిన వీరాంజనేయమ్మ ఓటును ఏవిధంగా తొలగించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతులు, నియోజకవర్గం వదిలి వెళ్లిన వ్యక్తులకు సంబంధించి ఎంట్రీలను క్షుణ్ణంగా పరిశీలించి ఓట్లు తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ నరసింహులు పాల్గొన్నారు. అనంతరం కొత్తచెరువులో పర్యటించి నూతన ఓటరు నమోదును సూపర్‌చెక్ చేశారు. ఆ తర్వాత ధర్మవరం పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మీకు ఓటు హక్కు ఉందా? ఓటు ఏమైనా తొలగించారా? తొలగించేటప్పుడు మీ అనుమతి తీసుకున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉండగా, వారి వివరాలను పక్కింటివారిని అడిగి తెలుసుకున్నారు. ఓటు నమోదు, మార్పులు, చేర్పుల్లో అధికారులు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలన్నీ పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ధర్మవరం ఆర్డీఓ రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ యుగేశ్వరి దేవి, ఎన్నికల సిబ్బంది రాజ్‌కుమార్, బీఎల్‌ఓలు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య


లక్ష్మీదేవి మృతదేహం

ధర్మవరం అర్బన్: మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధర్మవరం పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. కొత్తపేటకు చెందిన లక్ష్మీదేవి (65) మంగళవారం ఉదయం ఇంట్లో వాజ్‌మోల్ తాగింది. గమనించిన కుమారుడు గంగాధర్ ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స ఫలించక మృతి చెందింది. మృతురాలికి ఒక్కడే కొడుకు గంగాధర్. పవర్‌లూమ్స్ మగ్గాలు నడుపుతున్న గంగాధర్ కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీదేవి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరుగా నమోదు కండి

- జాయింట్ కలెక్టర్ చేతన్


అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ చేతన్

హిందూపురం టౌన్: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలని జేసీ చేతన్ పిలుపునిచ్చారు. ఈ విషయంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నూతన ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పిస్తోందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం -6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫారం-7 ద్వారా మృతుల వివరాలను వారి కుటుంబ సభ్యులు ఓటరు జాబితా నుంచి డెత్ సర్టిఫికెట్ అప్లోడ్ చేసి తొలగించుకోవాలని సూచించారు. మార్పులు, చేర్పులు ఉంటే ఫారం-8 సమర్పించాలన్నారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ 1,080, డెమోగ్రాఫికల్ ఫిమేల్ ఎంట్రీస్ 866 ఉన్నాయని, వాటిని దరఖాస్తుదారులకు పోస్టల్ ద్వారా పంపుతామన్నారు. సిమిలర్ ఎంట్రీల్లో ఓటరు వారికి కావాల్సిన దానిని ఉంచుకుని మిలిగిన ఓట్లను డిలీట్ చేసుకోవాలన్నారు. ఓటరు నుంచి సమాచారం వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని వివరించారు. 2024 ఎన్నికల దృష్ట్యా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 32 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించామన్నారు. అనంతరం ఎంజీఎం పాఠశాలలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కౌంటర్, స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు. సమావేశంలో డీఎస్పీ కంజాక్షన్, తహసీల్దార్లు స్వర్ణలత, బాబు, నాగరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, వన్ టౌన్ సీఐ శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో రసం పీల్చే పురుగు దూరం


రైతులకు సూచనలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

పుట్టపర్తి అర్బన్: రైతులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగును దూరం చేయవచ్చని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య పేర్కొన్నారు. శాస్త్రవేత్త రవికిషోర్, మండల వ్యవసాయాధికారి వెంకట బ్రహ్మంతో కలిసి మంగళవారం పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు, చెర్లోపల్లి, వీరాంజనేయపల్లి సమీపంలో వేరుశనగ పంటలను ఆయన పరిశీలించారు. ఆకులపై పురుగు ఉండి రసం పీల్చడంతో ఆకులు ముడుచుకుపోయి చెట్టు ఎండిపోతుందన్నారు. దిగుబడులు తగ్గిపోయే అవకాశం ఉంటుందన్నారు. పురుగు నివారణకు అసిఫేట్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. దీంతో పాటు హెక్సాకొనజోల్ 1.6 ఎంఎల్ మందును ఒక లీటరు నీటికి కలిపి వేయాలన్నారు. అనంతరం ఎకరాకు 10 కిలోల యూరియా చల్లాలన్నారు. అలాగే, వేరుకుళ్లు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 400 ఎంఎల్ వాడాలని సూచించారు. పొటాషియం నైట్రేట్ కేజీని ఒక ఎకరాకు వేసుకోవాలని, దీంతో చెట్టుకు ఊడలు బాగా వచ్చి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

● నేత్రపర్వంగా పాతప్పస్వామి జాతర


పాతప్పస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని మహంతపురంలో మంగళవారం పాతప్ప స్వామి జాతర ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత నిర్వహించిన జాతరకు భక్తులు పోటెత్తారు. గ్రామ శివారులోని ఆలయంలో స్వామి వారికి వేకువజామునే విశేష అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం వెండి పల్లకీపై స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. సాయంత్రం వందలాది భక్తులు ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి గ్రామోత్సవం, గావుల ఉత్సవం నిర్వహించారు.


బోనాలు మోస్తున్న భక్తులు

బైకును ఢీకొన్న కారు.. యువకుడి దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన భరత్

పరిగి: బైకును కారు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మండలంలోని మోదా పంచాయతీ పరిధి చెర్లోపల్లి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు సమీపంలో మంగళవారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ జయలత తెలిపిన వివరాలు.. మండలంలోని గొరవనహళ్లికి చెందిన భరత్ (25) మగ్గాల పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. కొన్నేళ్ల క్రితం వివాహమైంది. భార్య శిల్ప ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. కర్ణాటక రాష్ట్రంలోని గుట్ట కొడిగెనహళ్లి నుంచి సొంత గ్రామం గొరవనహళ్లికి భరత్ మంగళవారం సాయంత్రం బైకుపై వస్తుండగా, చెర్లోపల్లి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు సమీపంలో కారు ఎదురుగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన భరత్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఏఎస్‌ఐ జయలత ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై ప్రాథమిక విచారణ చేపట్టారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

వృత్తి నైపుణ్యతతోనే రాణింపు

- సీనియర్ సివిల్ జడ్జి దీన

బుక్కరాయసముద్రం: వృత్తి నైపుణ్యతతోనే జీవనోపాధులు మెరుగుపడుతాయని రిమాండ్ ఖైదీలకు జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి దీన సూచించారు. మహిళా ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చేందుకు నాబార్డ్ సౌజన్యంతో ఎంబ్రాయిడరింగ్ వర్క్‌పై జైలు సూపరింటెండెంట్ రహమాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం మంగళవారం అనంపురం జిల్లా జైల్‌లో జరిగింది. కార్యక్రమానికి నాబార్డ్ డీపీఎం అనూరాధతో కలసి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి దీన హాజరై మాట్లాడారు. రిమాండ్‌లో ఉన్న మహిళా ఖైదీలు ఖాళీగా ఉండకుండా టైలరింగ్, చీరలపై ఎంబ్రాయిడరింగ్‌పై శిక్షణ ఇవ్వడాన్ని అభినందించారు. వృత్తి నైపుణ్యత పెంపొందించుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. అనంతరం 60 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలకు నాబార్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన సర్టిఫికెట్లను న్యాయమూర్తి ప్రదానం చేశారు.

రేపటి నుంచి 'వందేభారత్' వేళల్లో మార్పు



అనంతపురం సిటీ: జిల్లా కేంద్రం మీదుగా నడిచే వందేభారత్ రైళ్ల రాకపోకల్లో స్వల్ప మార్పులు చేశారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాచిగూడలో ఉదయం 5.45కు బయలుదేరి అనంతపురానికి 10.29 గంటలకు చేరుకుంటుంది. తిరిగి యశ్వంతపుర నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరే రైలు సాయంత్రం 5.05 గంటలకు అనంతపురానికి చేరుకుంటుంది. మారిన వేళలు గురువారం నుంచి అమలులోకి రానున్నాయి.

ఏపీలో క్రియాశీలకంగా బీజేపీ


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్: రాష్ట్రంలో బీజేపీ క్రియాశీలక పార్టీగా ఎదగబోతోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి పట్టణంలోని సాయిఆరామంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 350 ఎంపీ స్థానాలతో మూడో సారి నరేంద్రమోదీ భారత ప్రధాని కానున్నారన్నారు. తెలంగాణలో బీజేపీ ఓటు శాతం పెరిగిందన్నారు. ఏపీలో జనసేనతో బీజేపీ పొత్తు ఉంటుందన్నారు. బీజేపీతో కలిసొచ్చే వారికి ఆహ్వానం పలుకుతామన్నారు. సంచలనం కోసం దుండగులు పార్లమెంట్‌లో చేసిన దుశ్చర్యను కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు రాజకీయం చేయడం నీతి మాలిన చర్య అని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కత్తిరాజారెడ్డి, నరేంద్రబాబు, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఆర్ నుంచి యువకుడి మృతదేహం వెలికితీత


ఆర్య (ఫైల్)

కూడేరు: మండల పరిధిలోని మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) బ్యాక్ వాటర్‌లో ఆదివారం గల్లంతైన యువకుడు మృతదేహమై తేలాడు. మూడు రోజులుగా కూడేరు ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది గాలింపు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక బోట్లు వేసుకుని రిజర్వాయర్ లోతట్టు ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. సాయంత్రం 4 గంటలకు ఆర్య (22) మృతదేహం లభ్యమైంది. ఉరవకొండలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ధనుంజయ రెండో కుమారుడు ఆర్య... డిగ్రీ వరకూ చదువుకున్నాడు. స్నేహితులు ఆరుగురితో కలసి ఆదివారం ఎంపీఆర్ సందర్శనకు వచ్చాడు. బ్యాక్ వాటర్ ఒడ్డున ఉన్న మత్స్యకారుల తెప్పను గమనించి అందులో రిజర్వాయర్‌లోకి ప్రవేశించారు. మధ్యలోకి వెళ్లిన తర్వాత తెప్ప అదుపుతప్పడంతో ఆర్య నీటిలో పడి చూస్తుండగానే గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అప్పటి నుంచి ఎంపీఆర్‌లో ముమ్మర గాలింపు చేపట్టి మూడో రోజు ఆర్య మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. ఘటనపై కూడేరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ అంతరాయం తలెత్తనీయొద్దు


విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు

కదిరి టౌన్/తనకల్లు: వినియోగదారులకు విద్యుత్ అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) ఎన్‌వీ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన సేవలు అందించాలన్నారు. 1912 టోల్ ఫ్రీ నంబర్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కొక్కంటి సబ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈ మోసస్, ఏడీఏ షాజహాన్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ పాదచారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం గరుడాపురానికి చెందిన జి.గంగాధర్ (54) మంగళవారం ఉదయం కళ్యాణదుర్గానికి వెళ్లే ప్రధాన రహదారిని దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. గంగాధర్‌తో పాటు ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు కర్ణాటకలోని తిప్పారెడ్డిపల్లికి చెందిన ఆదిశేషు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గంగాధర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆదిశేషు పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాయలసీమలోనే 'సూపర్'కు ప్రత్యేక స్థానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి


హాజరైన డాక్టర్లు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటైన అనతి కాలంలోనే కార్డియాలజీ, న్యూరో సర్జరీ విభాగాల్లో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించి రాయలసీమలోనే ప్రత్యేక స్థానం వచ్చిన వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కొనియాడారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలందించాలని పిలుపునిచ్చారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇప్పటి వరకూ కెరొనరీ ఆంజియోప్లాస్టీలు 105, యాంజియోగ్రామ్‌లు 300, న్యూరో విభాగంలో 800 మేజర్, మైనర్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేయడంపై మంగళవారం సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ. 'అనంత' ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని తాను ఎంపీగా ఉన్న సమయంలో జిల్లాకు ఎయిమ్స్ తీసుకువచ్చేందుకు చేసిన ప్రయత్నాలను గుర్తు చేశారు. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అప్పట్లో అనంతకు మంజూరైన ఎయిమ్స్‌ను మంగళగిరికి మళ్లించి, జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కేటాయించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 2022లో సూపర్ స్పెషాలిటీలో కార్డియాలజీ, న్యూరో సేవలు మొదలయ్యాయన్నారు. ఇప్పటి వరకూ గుండె, న్యూరో సర్జరీ విభాగాల్లో మేజర్, మైనర్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసిన కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, తదితర సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

విద్య, వైద్యానికి పెద్దపీట..

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో విద్య, వైద్యాన్ని ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేరువ చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని తాజాగా రూ.25 లక్షలకు పెంచారన్నారు. రూ.300 కోట్లతో సర్వజనాస్పత్రిని విస్తరిస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ కేసులను అధికంగా చేయడం ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి నిధులు సమకూరేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్డియాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ ఆయా విభాగాల్లో వారందించిన సేవలను వివరించారు. వివిధ పరికరాల ఆవశ్యకత ఉందని, వాటిని ఏర్పాటు చేస్తే రోగులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. కియా కంపెనీ సీఈఓ డాంగ్లీ మాట్లాడుతూ... కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పరికరాలను సమకూర్చినట్లు గుర్తు చేశారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కియా సీఈఓను ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమార్, గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని తదితరులున్నారు.

జనవాక్కు

ఆరోగ్యశ్రీ ప్రాణాలు కాపాడింది



ఏపీఎస్ ఆర్టీసీలో ఏడీసీగా రిటైర్డ్ అయ్యా. ఇటీవల గుండె సంబంధిత సమస్యలు తలెత్తాయి. అనంతపురంలోని సవీరా ఆసుపత్రిలో 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పథకం కింద వైద్య చికిత్సలు పొందా. ఇలా రెండు సార్లు చేయించుకున్నా. నయా పైసా ఖర్చు కాలేదు. కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం నా జీవితాన్ని నిలబెట్టింది. ఉన్నతాశయంతో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన పథకం ఎంతోమంది పేదలకు ప్రాణభిక్ష పెట్టింది. తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సల పరిమితి రూ.25 లక్షలకు పెంచడం హర్షణీయం

– అంజినప్ప, శ్రీరంగరాజుపల్లి,పరిగి మండలం

రూపాయి ఖర్చు లేకుండానే బీమా



టీడీపీ హయాంలో పంటలు నష్టపోతే పరిహారం సక్రమంగా ఇచ్చేవారు కాదు. బీమా కంపెనీలకు చెల్లించిన ప్రీమియం మొత్తంలో సగం కూడా చేతికి అందేది కాదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్నదాతల నుంచి ఒక్క రూపాయి కూడా ప్రీమియం వసూలు చేయకుండా పంటల బీమా వర్తింపు చేశారు. పరిహారం కూడా ఏ సీజన్‌కు సంబంధించి ఆ కాలంలోనే అందిస్తున్నారు. నాకు గతేడాది 5 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు సంబంధించి రూ. 67,458 అందింది. బ్యాంక్ ఖాతాలో నేరుగా ప్రభుత్వం జమ చేసింది. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండడం సంతోషంగా ఉంది. – తిప్పే అడివప్ప, రైతు, హరేసముద్రం, మడకశిర మండలం

సొంతింటి కల నెరవేరింది



ధర్మవరంలోని కేతిరెడ్డికాలనీలో చాలా సంవత్సరాలు అద్దె ఇంట్లో నివసించాం. నా భర్త లక్ష్మీనారాయణ బేల్దారి పనులకు వెళ్లేవాడు. నేను మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చాక పట్టణంలోని తుంపర్తి సమీపంలో ఇంటి పట్టా ఇచ్చారు. అధికారులు బిల్లులు మంజూరు చేయడంతో ఇంటిని త్వరగా నిర్మించుకున్నాం. సీఎం జగన్ సాయంతోనే సొంతింటి కల నెరవేరింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కృషి మరువలేనిది. – జయలక్ష్మి, ధర్మవరం

పింఛనుతో ఆదుకుంటున్నారు



పుట్టినప్పటి నుంచి నాకు తెల్ల, ఎర్రరక్త కణాలు ఉత్పత్తి కాకపోవడంతో వైద్యులు హిమోఫిలియా వ్యాధిగా గుర్తించారు. మా నాన్న శ్రీరాములు ప్రైవేటు డ్రైవర్‌గా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో ప్రతినెలా వైద్యం కోసం ఎన్నో అవస్థలు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక నాకు రూ.10 వేలు పింఛను అందిస్తున్నారు. జీవితంపై భరోసా పెంచిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– పి.నాగార్జున, కేతిరెడ్డికాలనీ, ధర్మవరం

తాళం వేసిన ఇంట్లో చోరీ

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం గేట్ వద్ద జాతీయ రహదారి పక్కనే నివాసముంటున్న శంకర్‌గౌడ్ ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి నరసాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకుని చూడగా తలుపులు తీసి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలిస్తే బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలాన్ని ఎస్‌ఐ శివ పరిశీలించారు. ఒకటిన్నర తులం బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరించుకెళ్లినట్లుగా బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.